మనోధైర్యం కోల్పోవద్దు అండగా ఉంటాం

కంది జైలులో బీఆర్ఎస్ నాయకులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 28: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని, పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్లవాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేయడంతో సంగారెడ్డి జిల్లా కంది జైలులో ఉన్న వారిని సోమవారం కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి మనోధైర్యం చెప్పారు. సమస్యలపై పోరాటం ఆపొద్దని, బీఆర్ఎస్ అధిష్టానం అందరికీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

విద్యార్థులకు టై, బెల్టు, ఐడీ కార్డులు అందజేసిన ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ తదితరులు

షాబాద్, అక్టోబర్ 28: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగరగూడ ప్రాథమిక పాఠశాలలో దాతలు రూ. 50వేలతో విద్యార్థులకు టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, సౌండ్ బాక్సు తదితర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహిస్తే వారు మరింత ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చెప్పారు. దాతల సహకారంతో పాఠశాల భవనానికి పెయింటింగ్ వేయించామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్, హెచ్ఎం కృష్ణ, కాంప్లెక్స్ హెచ్ఎం నాగిరెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు డేవిడ్‌రెడ్డి, నర్సింహులు, ఖాజా పాషా, ఉపాధ్యాయురాలు కవిత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, దాతలు, నాయకులు బల్వంత్‌రెడ్డి, కృష్ణ, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

ఆదిబట్ల, అక్టోబర్ 28: ఆదిబట్ల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15వ వార్డులో రూ.30లక్షలు, 9వ వార్డులో రూ.5 లక్షలు, 11వ వార్డులో రూ.10లక్షలు, ఒక టో వార్డులో రూ.5లక్షలతో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో మరిన్ని నిధులు కేటాయించి మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు అర్చన, కమిషనర్ బాలకృష్ణ, డీఈ స్వర్ణకుమార్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో బుగ్గ జాతర ఏర్పాట్లు

- ఎంపీడీవో బాలాశంకర్
- ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలాశంకర్

మంచాల, అక్టోబర్ 28: మండల పరిధిలోని ఆరుట్ల సమీపంలో ఉన్న బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేస్తామని ఎంపీడీవో బాలాశంకర్ తెలిపారు. నవంబర్ 15 నుంచి ప్రారంభం కానున్న జాతర ఉత్సవాల ఏర్పాట్లపై సోమవారం ఆరుట్ల పంచాయతీ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాశీ తర్వాత మరో పుణ్యక్షేత్రమైన బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భక్తుల వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని గుర్తిస్తామన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి జాతర ఏర్పాట్లపై వారంలోపు ఆలయ ఆవరణలో అన్ని శాఖల అధికారులతో సమావేశమై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, యాదయ్య, మాజీ ఎంపీటీసీలు చీరాల రమేశ్, కావలి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, గ్రామస్తులు గుడ్డిమల్ల చంద్రయ్య, కందాల శ్రీశైలం, పున్నం రాము, రమణారెడ్డి, సురేశ్, మార సురేశ్, అంతటి రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గడ్డ మీది పెంటయ్య గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్లటౌన్, అక్టోబర్ 28: కొత్త ఏఎంసీ పాలకవర్గం రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గడ్డ మీది పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బ్యాగరి రాములుతో పాటు పాలకవర్గ సభ్యులు సోమవారం కార్యాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కార్యాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు పాలక వర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలక వర్గ సభ్యులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ ఈ నెల 30న ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. గ్రామాల్లోని లబ్ధిదారులు అందరూ హాజరు కావాలని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

మెడల్స్, సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఎంఈవో పాండు

ఆమనగల్లు, అక్టోబర్ 28: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో పగిడిపాల పాండు అన్నారు. సోమవారం పట్టణంలోని వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) పీడీ, పీఈటీల ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎంఈవో మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాబీర్, ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రటరీ భీముడు, పీడీలు పాండు, విజయ్ రాథోడ్, రిజ్వానా పాఠశాల ప్రిన్సిపాల్ మహ్మద్, కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మల్లేశ్, నజీర్, హజ్ర, స్వప్న, రత్నకుమారి, పాఠశాల పీఈటీలు శంకర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఆర్డీవోగా సరిత

షాద్‌నగర్, అక్టోబర్ 28: షాద్‌నగర్ నూతన ఆర్డీవోగా ఎన్ఆర్ సరిత విధుల్లో చేరనున్నారు. ప్రస్తుత షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావు బదిలీపై మహబూబాబాద్‌కు వెళ్లారు. ఎన్నికల విభాగంలో విధులు నిర్వహించిన సరిత షాద్‌నగర్ ఆర్డీవోగా విధులు నిర్వహించనున్నారు. బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

చేవెళ్లలో..

చేవెళ్లటౌన్: చేవెళ్ల ఆర్డీవోగా పని చేస్తున్న సాయిరాం సికింద్రాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జీఏడీలో పని చేస్తున్న చంద్రకళ చేవెళ్ల ఆర్డీవోగా బదిలీ అయ్యారు. ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వుల్లో భాగంగా ఈ బదిలీలు జరిగాయి. చేవెళ్ల ఆర్డీవోగా పని చేసిన సాయిరాం నిజాయితీ వ్యక్తిగా మంచి పేరు సంపాదించుకున్నారు. ముక్కు సూటిగా మాట్లాడే తత్వం, నిబంధనలను పాటించే వ్యక్తిగా పేరుంది.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేసిన మెదక్ జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ నర్సింహారావు తదితరులు

మొయినాబాద్, అక్టోబర్ 28: ఇంజినీరింగ్ విద్యార్థులు వినూత్న పద్ధతిలో కొత్త ఆవిష్కరణలు చేపట్టేందుకు అదనంగా సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ నర్సింహారావు, జేకర్వ కో ఫౌండర్, సిటీవో అవినాష్ పిట్టి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు కారస్ పేరుతో జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌ను సోమవారం ప్రారంభించారు. టెక్నికల్ ఫెస్ట్‌లో ఏఐ, డేటా సైన్స్, యాప్, వెబ్ డెవలప్‌మెంట్, ఐవోటీ, బ్లాక్ చైన్, గ్రీన్ కన్‌స్ట్రక్షన్ కల్చ్, త్రీడీ ప్రింగ్ క్లబ్, ఎలక్ట్రికల్ వెహికల్స్ తదితర 8 విభిన్న కబ్‌లతో వివిధ పోటీలు నిర్వహించారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 50 ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాళ్లు డాక్టర్ సాయి సత్యనారాయణ, డాక్టర్ ఉదయశ్రీ, హెచ్‌వోడీస్ , కన్వీనర్స్ లోకేశ్ చంద్ర, అఫ్రాజ్, స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులు ప్రెసిడెంట్ వినయ్‌సాయి, వైస్ ప్రెసిడెంట్ సాయి చరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



అలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భక్తుడు

షాద్‌నగర్‌రూరల్, అక్టోబర్ 28: మండల పరిధిలోని మొగిలిగిద్దలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి చట్టచంద్రశేఖర్, శ్రీనివాసులు, రవి తమ తండ్రి జ్ఞాపకార్థం సోమవారం రూ.11,116 అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయంలో ఆంజనేయస్వామి, శ్రీరామ విగ్రహాల ప్రతిష్ఠాపనను నవంబర్ 25 నుంచి 28వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేశ్ గుప్తా, వెంకటయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీహరి

యాచారం, అక్టోబర్ 28: ఆస్తి ధ్రువీకరణ పత్రం ఇవ్వడంలో జాప్యం చేసి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి కారణమైన చౌదర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటికెల శ్రీహరి కోరారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ.. ప్రజల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

షాబాద్: అప్పారెడ్డిగూడలో పశువుకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్, అక్టోబర్ 28: పశువుల ఆరోగ్యంపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, అంతిరెడ్డిగూడ, కొమరబండ, చందనవెల్లి గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

మొయినాబాద్ : పాడి రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు గ్రామంలో 194 పశువులకు టీకాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పద్మ, ప్రసన్న కుమార్, భీంరావు, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్: హిమాయత్‌నగర్‌లో పశువుకు గాలికుంటు నివారణ టీకా ఇస్తున్న వైద్యులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కొత్తూరు, అక్టోబర్ 28: ప్రహరీ కూల్చివేసి దూషించిన కేసులో కొత్తూరు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన తుప్పర రాములు, బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్ మధ్య కొన్ని రోజులుగా భూ వివాదం నడుస్తున్నది. ఈ నేపథ్యంలో వివాదాస్పద భూ ప్రహరీని కూల్చివేసి తమను దూషించారని దేవేందర్, మేకల రాఘవేందర్, లక్ష్మణ్‌పై తుప్పర రాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్టీ, ఎస్టీ కేసు నమోదు చేశామని సీఐ నర్సింహారావు తెలిపారు.

లెనోరా ప్రైడ్ ఉన్నత పాఠశాలకు నోటీసు జారీ

ఆమనగల్లు, అక్టోబర్ 28: మండల కేంద్రంలోని లెనోరా ప్రైడ్ ఉన్నత పాఠశాల యాజమాన్యానికి ఎంఈవో పాండు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ పాఠశాలలో బాలురు, బాలికలకు ఒకే మూత్రశాల, మరుగుదొడ్డి ఏర్పాటు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవోకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. వారం క్రితం ఎంఈవో పాఠశాలను సందర్శించి వెంటనే ప్రత్యేకంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యాజమాన్యం స్పందించకపోవడంతో మరోసారి ఎంఈవో పాఠశాలను సందర్శించి నోటీసు జారీ చేసి వెంటనే సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

వెల్జాల్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు

కడ్తాల్, అక్టోబర్ 28: గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం తలకొండలపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలోని బీసీ కాలనీలో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి కాలనీలో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను నిర్మిస్తామని తెలిపారు. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. గ్రామాభివృద్ధికి సమష్టిగా కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు ముజ్బూర్ రెహ్మాన్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసామూర్తి, మాజీ ఉప సర్పంచ్‌లు ఆజీజ్, నర్సింహ, నాయకులు నరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్, యాదయ్య, సుదర్శన్, అభిలాశ్ గౌడ్, విజయ్‌యాదవ్, బాలస్వామి, రవి, పరందాములు, యాదగిరి, నర్సింహ, మధు, సాయి, పీఆర్ ఏఈ విక్రమ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శరత్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ, డీఏలను వెంటనే విడుదల చేయాలి

తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీపీయూస్ సభ్యులు

కడ్తాల్, అక్టోబర్ 28: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ప్రముఖ్ సుమరంజిత డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధాయుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ టీపీయూస్ రాష్ట్ర ఆదేశాల మేరకు, సోమవారం తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుమరంజిత మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఐదు డీఏలకు ఒక్క డీఏనే ఇస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో ఉద్యోగులంతా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా ఉద్యోగులకు ఎలాంటి ఆర్థికపరమైన ప్రయోజనం కలగ లేదన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిపడ్డా పీఆర్సీ, డీఏలను, ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో నవంబర్ 23న హైదరాబాద్‌లో ధర్మాగ్రహ దీక్ష చేపడతామని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో టీపీయూస్ మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మండల గౌరవాధ్యక్షుడు భాస్కర్, మహిళా కన్వీనర్ మాధవి ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

బెటాలియన్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్, అక్టోబర్ 28: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది సహకరించాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆక్టోపస్‌లో ఉన్న 3వ బెటాలియన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బందితో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రోడ్లపైకి వచ్చి ఆందోళన చేయడం సరికాదన్నారు. సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, అదనపు సీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ, ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.

దొంగతనాలు, సైబర్ నేరాలపై అవగాహన

మేడిపల్లిలో వృద్ధులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

యాచారం, అక్టోబర్ 28: దొంగతనాలు, సైబర్ నేరాలపై అవగాహన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని మేడిపల్లిలో సోమవారం సీఐ ఆధ్వర్యంలో పోలీసులు సైకిల్ పెట్రోలింగ్ నిర్వహించారు. గ్రామంలో సైకిళ్లపై తిరుగుతూ మహిళలు, ప్రయాణికులు, విద్యార్థినులు, వృద్ధులకు దొంగతనాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొంగతనాలు, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత డ్రగ్స్, గంజాయి తదితర నిషేధిత వస్తువులకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులతో ప్రజలు ఫ్రెండ్లీగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానంగా కనిపించినా, ఎక్కడైనా దొంగతనాలు జరిగినా అధైర్యపడకుండా వెంటనే 100నంబర్‌కు పోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, సుందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

వ్యక్తి మృతి

రాంబాబు (ఫైల్)

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 28: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై అబ్దుల్లాపూర్‌మెట్టు వద్ద ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ అంజిరెడ్డి కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా చండూరు మండలం నెర్మట గ్రామానికి చెందిన బొండు రాంబాబు (24) ఆదివారం రాత్రి మట్టంపల్లి ఎన్సీఎల్ కంపెనీలో సిమెంటు లోడ్‌తో హైదరాబాద్‌లోని మియాపూర్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం బాటసింగారంలోని మౌంట్ ఒపెరా వద్దకు చేరుకోగానే.. అప్పటికే హైవే పక్కన ఎలాంటి సిగ్నల్ వేయకుండా నిలిపి ఉంచిన లారీని గమనించక వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాంబాబు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రైతు భరోసా ఎకరానికి 15 వేలు ఇవ్వాలి

ఆదిబట్ల, అక్టోబర్ 28: వర్షాకాలం, యాసంగి పంటలకు పంట పెట్టుబడి సాయం రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు జాజాల అంజయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, బాల్‌రెడ్డి, బాలయ్య, శ్రీనివాస్, రజినీకాంత్, చత్రునాయక్, అమర్ సింగ్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో దామోదర్ సేవలు గొప్పవి

డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్‌ను సన్మానించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ బీవీ రావు తదితరులు

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 28: వైద్య రంగానికి దామోదర్ చేసిన సేవలు గొప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బీవీ రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం శంకరపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీవీ రావు పాల్గొని దామోదర్ దంపతులను సన్మానించారు. అనంతరం ఆయన వైద్య రంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, లా ఆఫీసర్ కె.వీరబ్రహ్మచారి, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నర్సింహారెడ్డి, ఆర్యవైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గందె సురేశ్, జిల్లా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.